



భానుడి భగభగ

- పగటి పూట తీవ్రమవుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- కూలర్లు, ఏసీలు, శీతల పానీయాలకు పెరిగిన డిమాండ్
- జిల్లాలో పగటిపూట నిర్మానుష్యంగా ప్రాంతాలు
- జిల్లాలో అత్యధికంగా 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత



సిరిసిల్లలో నిర్మానుష్యంగా పెద్దబజార్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సూర్యుడు ఈసారి ముందే సుర్రుమనిపిస్తున్నాడు. ఏటా మేలో కనిపించే ఉష్ణోగ్రతలు మార్చిలోనే నమోదవుతున్నాయి. నాలుగు రోజులుగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భగభగ మండే ఎండలను చూసి జనం ఇంట్లోనుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. అవసరం మేరకే బయటికి వస్తున్నారు. రెండు రోజులుగా జిల్లాలో 40 డిగ్రీలవరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం కనిష్ఠ ఉష్ణోగ్రత 20.0 డిగ్రీలు ఉండగా గరిష్ఠ ఉష్ణోగ్రత 40.3 డిగ్రీలుగా నమోదైంది. మరో వైపు ఈసారి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

● నిర్మానుష్యంగా రోడ్లు

మండే ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నాలుగు రోజులుగా మధ్యాహ్నం వేళల్లో వడగాలులు కూడా వీస్తుండడంతో అప్రమత్తమవుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఎప్పుడూ రద్దీగా ఉండే గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తా, వెంకంపేట రోడ్, మార్కెట్ ఏరియా, చేనేత చౌక్, తెలంగాణ తల్లి చౌక్, గోపాల్‌నగర్, తదితర ప్రాంతాలు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. మధ్యాహ్నం వేళ ఎండతీవ్రతకు భయపడి జనం బయటకు రావడం లేదు. ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత కనిపిస్తోంది.



నిర్మానుష్యంగా గాంధీ చౌక్

● కూలర్లు, ఏసీలు, శీతల పానీయాలకు డిమాండ్

జిల్లాలో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు కూలర్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు ఫ్యాన్లు, ఫ్రిజిరేటర్‌లకు డిమాండ్ పెరిగింది. వేసవి ఉపశమనానికి జనాలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. సమ్మర్ వ్యాపారాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా ప్రత్యేక స్టాళ్లు కూడా వెలిశాయి.

జిల్లాలో ఉష్ణోగ్రతలు

మండలం	ప్రాంతం	కనిష్ఠం	గరిష్ఠం
వీర్నపల్లి	వీర్నపల్లి	30.7	40.3
కోనరావుపేట	మర్తనపేట	30.7	39.9
సిరిసిల్ల	సిరిసిల్ల	29.5	39.6
ఇల్లంతకుంట	ఇల్లంతకుంట	31.3	39.6
వేములవాడ రూరల్	వట్టెంల	29.3	39.3
చందుర్తి	మర్రిగడ్డ	30.0	38.9
తంగళ్లపల్లి	నేరేళ్ల	29.4	38.7
బోయినపల్లి	బోయినపల్లి	28.4	38.5
వేములవాడ	నాంపల్లి	30.5	38.4
గంభీరావుపేట	గంభీరావుపేట	29.7	38.8
రుద్రంగి	మానాల	30.6	38.3
ముస్తాబాద్	నామాపూర్	29.5	38.8
ఎల్లారెడ్డిపేట	ఎల్లారెడ్డిపేట	28.6	37.9

మహిళలు, విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు

సిరిసిల్ల క్రైం, మార్చి 27: మహిళలు, విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అపరిచిత వ్యక్తులు పంపే మెస్సేజ్‌లకు స్పందించవద్దన్నారు. వేధింపులపై నిర్భయంగా జిల్లా షీటీమ్ నంబరు 8712656425కు లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో ఫేక్ ఐడీలతో అకౌంట్‌లు క్రియేట్ చేస్తున్నారని, మహిళల సోషల్ మీడియా అకౌంట్‌లను హ్యాక్ చేసి అసభ్యకర వీడియోలు, ఫొటోలు పంపుతున్నారని అన్నారు. ఇటీవల ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, అలాంటివారిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆడపిల్లలను, మహిళలను వేధించినా, అసభ్యకరమైన ఫొటోలు, వీడియోలు పంపినా, సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టు చేసినా, మిత్రులకు షేర్‌చేసినా తీవ్ర నేరంగా పరిగణిస్తామన్నారు.

నేడు కేటీఆర్ పర్యటన

సిరిసిల్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కే తారకరామారావు గురువారం సిరిస్లిల నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. ముస్తాబాద్ మండలం బందనకల్‌లో గృహప్రవేశం, సిరిసిల్లలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ కుమారుడి వివాహ వేడుక, సిరిసిల్ల షాదీఖానాలో ఇఫ్తార్ విందుకు హాజరుకానున్నారు. ముస్తాబాద్ మండలం గన్నెవానిపల్లెలో వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను పరిశీలించనున్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో విద్యుత్ స్తంభం పడి చనిపోయిన ఎలుసాని ఎల్లయ్య కుటుంబాన్ని, నష్టపోయిన హోటల్ యజమాని రవి కుటుంబాన్ని పరామర్శించనున్నారు.

ఒకటో తేదీన మెగా జాబ్ మేళా

గంభీరావుపేట, మార్చి 27 : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ ఒకటో తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, స్పందన ఫైనాన్స్ లిమిటెడ్, మెడ్ ప్లస్, అమెజాన్ వంటి కంపెనీలు హాజరవుతున్నాయని పేర్కొన్నారు. 2018 నుంచి 2023 వరకు డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు, ఈ సంవత్సరం తృతీయ సంవత్సరం విద్యార్థులు అర్హులని తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, 4 సెట్ల జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని వెల్లడించారు.

ఉపాధిహామీ పని స్థలాల్లో సౌకర్యాలు కల్పించాలి

ఇల్లంతకుంట, మార్చి 27: ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించాలని డీఆర్డీవో శేషాద్రి సూచించారు. మండలంలోని ఒగులాపూర్‌లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ నర్సింహులు, ఏపీవో చంద్రయ్య, టీఏ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి ముక్తార్‌అహమ్మద్, ఫీల్డ్ అసిస్టెంట్ కనుకయ్య పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న డీఆర్డీవో

వైభవంగా పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం

వీర్నపల్లి, మార్చి 27 : వీర్నపల్లిలోని పెద్దమ్మ పెద్దిరాజుల ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని ముదిరాజులు బుధవారం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని పెద్దమ్మ, పెద్దిరాజులను దర్శించుకున్నారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

టెట్ ఫీజు తగ్గించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 27: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన టెట్ ఫీజును వెంటనే తగ్గించాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. టెట్ ఫీజు పెంచడంతో నిరుద్యోగ అభ్యర్థులకు అన్యాయం చేయడమే కాకుండా ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోందన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజారావు, అక్షయ్, కృష్ణ, రాఘవేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా లక్ష్మీవేంకటేశ్వరుని కల్యాణం

ముస్తాబాద్, మార్చి 27 : మండలంలోని గూడెంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామికల్యాణ మహోత్సావం బుధవారం కన్నుల పండువగా సాగింది. మాజీ సర్పంచ్ చిట్నేని సరిత శ్రీనివాస్‌రావు, ఎంపీటీసీ బొప్ప శ్రీధర్, మాజీ ఉపసర్పంచ్ చాడ శ్రీనివాస్, వెంకటరమణ, బొప్ప విష్ణు, కొమ్ము బాలయ్య, జిల్లెల్ల మల్లేశం లింగంపెల్లి ఎల్లాగౌడ్, బొప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేతన్నల బతుకులతో ఆడుకోవద్దు



సిరిసిల్లలో నేతన్న విగ్రహం ఎదుట మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 27 : నేతన్నల బతుకులతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకోవద్దని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో నెలకొన్న వస్త్ర పరిశ్రమ సంక్షోభం, కార్మికులకు ఉపాధిపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బుధవారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోడం రమణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే వస్త్ర పరిశ్రమగా పేరుగాంచిన సిరిసిల్లలో ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయిందని, వేలాది మంది కార్మికులకు ఉపాధిని కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన ఉపాధి లేక కుటుంబ పోషణ కోసం కార్మికులు అప్పులు చేసే దుస్థితికి వచ్చిందన్నారు. నేతన్నలకు చేయుత అందించి బతుకులను బాగు చేయాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోకుండా కార్మికుల జీవితాలతో చెలగాట మాడుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా రాజకీయాలను పక్కన బెట్టాలని, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే సిరిసిల్లలో నేతన్నలకు ఉపాధిని కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం నుంచి ర్యాలీ చేపట్టారు.



భిక్షాటన చేస్తున్న కార్మికులు, నాయకులు

నేడు వంటావార్పు

సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళీశాఖ కార్యాలయం ఎదుట నేతన్నలతో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించాలంటూ గురువారం వంటావార్పు చేపట్టనున్నట్లు రమణ తెలిపారు. నాయకులు సిరిమల్లే సత్యం, ఉడుత రవి, ఓగ్గు గణేష్, సదానందం, భాస్కర్, క్రిష్ణ, ఇస్తారి, రాజు, సురేష్, తిరుపతి, శంకర్, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

- కలెక్టర్ అనురాగ్ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 27: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయని, పోలింగ్ రోజు ఓటు వేయలేని వారి కోసం ఫారం 12డీ లను అందుబాటులో ఉంచామని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ కోసం ప్రత్యేక నోడల్ అధికారిని నియమిస్తామన్నారు. 33 అత్యవసర శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. 85 ఏళ్ల వయస్సు వారు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్ద ఓటు వేసే అవకాశం కల్పిస్తారని, తేదీ సమయం ముందుగానే సమాచారం ఇస్తారని అన్నారు. పోస్టల్ బ్యాలెట్లు పొందడానికి ఫారం 12డీని సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుందని, వ్యక్తిగత వివరాలు ఓటరు గుర్తింపు సమాచారం పోస్టల్ బ్యాలెట్ ఎందుకు కోరుతున్నారో చెప్పాలని అన్నారు. రిటర్నింగ్ అధికారి వాటిని పరిశీలించి అర్హత ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ మంజూరు చేస్తారన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు గౌతమి, ఖీమ్యా నాయక్, సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీఈవో, రమేష్ కుమార్ డీడబ్ల్యూవో లక్ష్మిరాజం, ఏవో రామ్ రెడ్డి, ఎలక్షన్ పర్యవేక్షకులు, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, మార్చి 27 : చందుర్తి మండలం కట్టలింగంపేట గ్రామంలో బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గ్రామస్థులు పోచమ్మకు బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన గెలుపులో భాగస్వామ్యమైన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్ని వేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో జట్పీటీసీ నాగం కుమార్, నాయకులు చింతపటి రామస్వామి, గొట్టె ప్రభాకర్, ధర్మపురి శ్రీనివాస్, అంజన్ రావు, మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

చందుర్తి, మార్చి 27: మండలంలో పలు గ్రామాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. చందుర్తి మండలం ఎన్గల్, మర్రిగడ్డ, తిమ్మాపూర్, మూడపల్లి తదితర గ్రామాల్లో ఎక్కడికక్కడే విద్యుత్ తీగలు కిందకి వేలాడుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పొలాల్లోకి రైతులు వెళ్లాలన్నా, విద్యుత్ తీగల కింద ఉన్న పొలాల్లో పనులు చేయాలన్నా కూలీలు బెంబేలెత్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న పలు చోట్ల రైతులే తాత్కాలికంగా కట్టెలతో స్తంభాలను ఏర్పాటు చేసుకున్నారు. మరికొన్ని గ్రామాల్లో విద్యుత్ తీగలను తాకుతూ చెట్లు, పొదలు పెరిగినా వాటిని తొలగించే చర్యలు చేపట్టడం లేదు. గాలికి కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోంది. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.



ఎన్గల్ శివారు బండపల్లి వైపు వెళ్లే దారిలో పొలం వద్ద విద్యుత్ తీగలు

తీగలను సరిచేయాలి

- పులి మనోహర్, ఎన్గల్



పంట పొలాల వద్ద కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను ప్రమాదం జరుగకముందే సెస్ అధికారులు సరి చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం వరి కోతలు జరుగుతు న్నాయి. హార్వెస్టర్ రాక పోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు తగలడంతో పశుగ్రాసం తరలిస్తున్న ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు దగ్ధమయ్యాయి. నష్టం జరుగకముందే అధికారులు చర్యలు చేపట్టాలి.

అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

- ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు - అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంక్ పరిసరాలు



తాగు నీటి ట్యాంకు చుట్టూ పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారం

ఎల్లారెడ్డిపేట, మార్చి 26: పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అధికారుల పర్యవేక్షణ లేక పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఏ వార్డులో చూసినా అపరిశుభ్రత కనిపిస్తోంది. తాగు నీటి ట్యాంకు చుట్టూ మురుగు చేరి కంపు కొడుతోంది. చెత్తాచెదారంతో నిండిపోయి పందులు సంచరిస్తున్నాయి. మురుగు వద్దే నిలబడి కాలనీవాసులు నీరు పట్టికోవాల్సిన పరిస్థితి. ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య మురుగు నీరు నిలిచి దుర్వాసన భరించలేకపోతున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఈ విషయమై ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సత్తయ్యను వివరణ కోరగా గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపడుతామన్నారు. తాగు నీటి ట్యాంకు చుట్టూ పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారం, ఇళ్ల మధ్య నిలిచిన మురుగును తొలగించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతి

మల్లాపూర్, మార్చి 27: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన పుట్ట ధర్మయ్య(38) అనే పశువుల కాపరి తేనెటీగల దాడిలో బుధవారం మృతి చెందాడు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేటకు చెందిన పుట్ట ధర్మయ్య బుధవారం పశువులను మేపుకుంటూ గ్రామ శివారులోకి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురికాగా మెట్‌పల్లిలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ధర్మయ్య మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాలీ ఆటోను అపహరించిన వ్యక్తిని పట్టుకున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో ఓ ట్రాలీ ఆటోను అపహరించి అనుమానాస్పదంగా కనిపించిన గుర్తు తెలియని వ్యక్తిని బుధవారం రాత్రి స్థానికులు పట్టుకున్నారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సిరిసిల్ల గోపాల్‌నగర్ ప్రాంతంలో నిలిపి ఉంచిన బండారి లక్ష్మణ్‌కు చెందిన ట్రాలీ ఆటోను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. తన వాహనం కనిపించకపోవడంతో ఆందోళన చెందిన వాహన యజమాని లక్ష్మణ్ చుట్టు పక్క గ్రామాల ఆటో డ్రైవర్లకు సమాచారం అందించాడు. వెంకటాపూర్ గ్రామ శివారులో అనుమానస్పదంగా ట్రాలీ ఆటోతో ఓ వ్యక్తి కనిపించాడు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో స్థానికులు అతన్ని తాళ్లతో కట్టేసి దేహశుద్ధి చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి 10 రోజుల జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 27: మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడిన ఒక వ్యక్తికి పది రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరు వ్యక్తులకు ఏడు రోజుల జైలు శిక్ష, ఒక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష, ఇద్దరు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్షతోపాటు జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇటీవల పోలీసులకు పట్టుబడిన 18 మందిని కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఆరుగురికి జైలు శిక్ష,మొత్తం10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 12 మందికి 18,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

శివపార్వతుల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

● ఈవో కృష్ణప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ, మార్చి27: రాజరాజేశ్వర క్షేత్రంలో శివపార్వతుల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో డి.కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం నిర్వహించనున్న శ్రీస్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆలయ అధికారులు, పోలీసు అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారి దివ్యకల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తామని, ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. కల్యాణం తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివస్తున్న విషయం దృష్టిలో ఉంచుకుని విశాలమైన వేదికను ఏర్పాటు చేశామని అన్నారు. కల్యాణం తిలకించడానికి వీలుగా భారీ స్ర్కీన్లు అమర్చామన్నారు. భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా క్యూలైన్లు క్రమబద్ధీకరించామని అన్నారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజుల పాటు కోడెమొక్కులు మినహా అన్ని రకాల ఆర్జిత సేవలు నిలిపివేశామని అన్నారు.

రాజన్నక్షేత్రంలో వైభవంగా శివకల్యాణోత్సవాలు

● స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ● నేడు పార్వతీరాజరాజేశ్వరస్వామివారి కల్యాణం



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ధర్మగుండంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి27: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో శివకల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు ఉదయం 8-05 గంటలకు శివ భగవత్పుణ్యాహవచనము గావించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీస్వామివారి కళ్యాణ మంటపంలో ఆచార్య దంపతులు దంపతులకు, అర్చకస్వాములకు, వేదపండితులకు ఆలయ ఈఓ కృష్ణప్రసాద్ వరుణి అందజేశారు. అనంతరం అర్చకులు పంచగవ్య మిశ్రణము, దీక్షాధారణము, మంటప ప్రతిష్ఠ, నవగ్రహ ప్రతిష్ఠ, గౌరీ షోడశ మాతృకా ప్రతిష్ఠ, మృత్సంగ్రహణము, అంకురార్పణము, వాస్తు ప్రతిష్ఠ, సోమకుంభ కలశ ప్రతిష్ఠ, వాస్తుహోమము, కుండ సంస్కారం, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు ఉదయం మహామండపంలో శ్రీరాజరాజేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించగా, వేదపండితులు వేదపారాయణం గావించి, పరివార దేవతార్చనలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీస్వామివారి కల్యాణమంటపంలో శివపురాణ ప్రవచణం చేవారు. రాత్రి భేరీ పూజ, దేవతాహ్వానము నిర్వహించారు. శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామి వారి దివ్యకల్యాణోత్సవం 28వ తేదీ గురువారం నిర్వహించనున్నారు. కల్యాణానికి వేములవాడ దివ్యక్షేత్రం అందంగా ముస్తాబైంది. ఆలయ చైర్మన్ చాంబర్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉ. 10-50 గంటల నుంచి అభిజిత్ లగ్న సుముహూర్తమున శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారల దివ్యకల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం శివ పురాణ ప్రవచనం, ప్రధాన హోమము, సప్తపది నిర్వహిస్తారు. శివకళ్యాణోత్సవానికి భక్తులు, శివపార్వతులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ మేరకు భక్తులు శ్రీస్వామివారి కల్యాణం వీక్షించడానికి ఆలయ ప్రాంగణంలో స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. శివకల్యాణోత్సవాల సందర్భంగా కోడెమొక్కుతో పాటు ఐదు రోజుల పాటు అభిషేకం, అన్నపూజ తదితర అన్నిరకాల ఆర్జిత సేవలను నిలిపివేశారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

రాజరాజేశ్వర క్షేత్రంలో శివకల్యాణోత్సవాల సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ అంజయ్య పరిశీలించారు. ఎద్ద సంఖ్యలో భక్తులు, శివపార్వతులు తరలివస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

దొంగల అరెస్టు

● నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం

కరీంనగర్ క్రైం, మార్చి 27: జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు వ్యక్తులతో పాటు ఒక మైనర్ ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలను చోరీ చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా బుధవారం కరీంనగర్ రూరల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సీఐ రవిందర్‌లు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ కృష్ణలంకకు చెందిన బొజ్జ మనోజ్ కుమార్ కొంత కాలంగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లో నివాసం ఉంటూ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. అతడి స్నేహితులైన హైదరాబాద్ బోయినిపల్లికి చెందిన బందెల సుమిత్, విజయవాడకు చెందిన ఎల్ల సత్య ఆంజనేయులుతో పాటు బాలుడు జల్సాలకు అలవాటు పడి డబ్బులు సరిపోనందున ఒక ముఠాగా ఏర్పడి బైక్‌లు దొంగిలిస్తున్నారు. నలుగురు కలిసి కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో నాలుగు బైక్‌లను చోరీ చేశారు. యమహా(టీఎస్ 22 హెచ్ 6478), పల్సర్(టీఎస్ 02 ఈఆర్ 7196), పల్సర్(టీఎస్ 25 ఎఫ్ 7024), (టీఎస్ 04 ఇజి 3006)లను ఈ ముఠా చోరీ చేసింది. ఈ బైక్‌లలో ఒకటి హైదరాబాద్‌కు తరలించిన నిందితులు మిగతా మూడు బైక్‌లను కూడా తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నలుగురు నిందితులపై కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, ఎల్ఎండీ ఠాణాలలో కేసులు నమోదు చేశారు.

భర్త చేతిలో భార్య హతం

● నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

పెద్దపల్లిటౌన్/ఎండపల్లి మార్చి 27: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారేడుపల్లికి చెందిన రజిత(35) భర్త చేతిలో మంగళవారం అర్ధరాత్రి హత్యకు గురైంది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తన కార్యాలయంలో బుధవారం వెల్లడించారు. ఎండపల్లి మండలం మారేడుపల్లికి చెందిన యాళ్ల పున్నంరెడ్డికి అదే మండంలం నర్సింగాపూర్‌కు చెందిన రజితతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. పున్నంరెడ్డి చెడు అలవాట్లకు బానిసై తరుచూ భార్యతో గొడవపడేవాడు. ఈ విషయమై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. మద్యం మానేసి కొనాళ్ల సజావుగా ఉన్న పున్నంరెడ్డి రెండు నెలల క్రితం నుంచి మళ్లీ తాగుడు మొదలు పెట్టాడు. దీంతో మళ్లీ గొడవలు మొదలయ్యాయి. ఇదే క్రమంలో మంగళవారం అర్ధరాత్రి మద్యం తాగి వచ్చిన భర్తను మళ్లీ ఎందుకు తాగుతున్నావని భార్య ప్రశ్నించింది. మద్యం మత్తులో ఉన్న పున్నంరెడ్డి కోపోద్రికుడై రజితను చేతికందిన ఇనుప వస్తువుతో తలపై బలంగా బాదడంతో రజిత అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు రజిత తల్లి వజ్రవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ మొదలుపెట్టారు. నిందితుడు పున్నంరెడ్డిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో పెద్దపల్లి సీఐ రాసూరి క్రిష్ణ, బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి పాల్గొన్నారు.

జగిత్యాలలో ఒకరి ఆత్మహత్యాయత్నం

జగిత్యాల టౌన్, మార్చి 27: జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో బుధవారం ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ములుగు జిల్లా నూజివీడు గ్రామానికి చెందిన మణికుమార్ సతీమణి జగిత్యాలలోని చిల్డ్రన్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తోంది. కొన్ని రోజులుగా వారికి కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. బుధవారం జగిత్యాలకు చేరుకున్న మణికుమార్ తన భార్యతో గొడవకు దిగాడు. తీవ్ర మనస్థాపానికి గురైన మణికుమార్ చేతిలో పురుగుల మందు డబ్బాను పట్టుకుని స్థానిక గొల్లపల్లి రోడ్‌లో కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నానని పేర్కొంటూ డయల్ 100కు సమాచారం అందించాడు. తక్షణమే స్పందించిన బ్లూ కోల్ట్స్ పోలీస్ జుబేర్ సంఘటనా స్థలానికి చేరుకుని పురుగుల మందు డబ్బాను లాక్కుని రక్షించాడు. అనంతరం చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ములుగు జిల్లాలోని వాజేడు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు.

కేబుల్ బ్రిడ్జిపై పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

● యువతి కారణమంటూ సూసైడ్ నోట్



రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 27: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన దూది రాజశేఖర్‌రెడ్డి(28) కరీంనగర్ శివారులోని కేబుల్ బ్రిడ్జిపై బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ఒక యువతి కారణమంటూ మృతుడి వద్ద ఒక సూసైడ్‌నోట్ లభించిందని ఒకటో ఠాణా ఎస్‌ఐ స్వామి తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి కరీంనగర్ మంకమ్మతోటలో ఒక అద్దె గదిలో నివాసం ఉంటూ తెలంగాణ చౌక్ సమీపం లోని ఒక మెస్ అండ్ రెస్టారెంట్‌లో 6 సంవత్సరాలుగా క్యాషియర్‌గా పనిచేస్తు న్నాడు. అతడికి ఏడాదిన్నర కిందట ఒక యువతి పరిచయం అయింది. ఇద్దరూ తరచుగా కలిసేవారు. ఇటీవల రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అతడికి వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువతి తననే వివాహం చేసుకోవాలని, లేకుంటే ఇద్దరు కలిసిన ఫొటోలు, మాటల వాయిస్ రికార్డులు బయట పెడతానంటూ రాజశేఖర్‌రెడ్డిని బ్లాక్‌మెయిల్ చేస్తూ కొన్ని డబ్బులు కూడా తీసుకుంది. ఈ నెల 23న ఆ యువతితో పాటు మరికొందరు రాజశేఖర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి గ్రామపంచాయతీ వద్ద గొడవ చేయగా గ్రామస్థులు సర్ది చెప్పి పంపించారు. రాజశేఖర్‌రెడ్డి తన కుటుంబ పరువు పోతుందని మనస్థాపంతో మంగళవారం ఉదయం కేబుల్‌బ్రిడ్జిపై పురుగుల మందుతాగి తన స్నేహితుడికి ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి మరణించాడని తెలిపారు. తన కొడుదు రాజశేఖర్‌రెడ్డి ఆత్మహత్యకు యువతి, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులే కారణమంటూ మృతుడి తండ్రి దూది రఘుపతిరెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. యువతితో పాటు ఆమె కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ స్వామి తెలిపారు.

ఘనంగా లక్ష్మీనృసింహుని ఉత్తర దిగ్యాత్ర



లక్ష్మీ నృసింహ స్వామి వారల ఊరేగింపు సేవ



ఉసిరిక వాగు సమీపంలో లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు

- ఉసిరిక వాగు వద్ద పూజలు అందుకున్న నారసింహుడు

ధర్మపురి, మార్చి 27: ధర్మపురి క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనృసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవమూర్తులను సాయంత్రం వేళలో సేవలపై ఆశీనులు చేశారు. పుర వీధుల గుండా ఉత్తర దిగ్యాత్ర కోసం ఉసిరిక వాగు వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద స్వామివారల సేవలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. దారిపొడవుగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రాత్రి వేళలో స్వామి వారల సేవలు తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణయ్య ఆధ్వర్యంలో అర్చకులు వంశీకృష్ణ, విజయ్, మోహన్, కిరణ్, నవీన్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు రాపర్తి సాయికిరణ్, మాదాసు మల్లేష్, నేదునూర్ శ్రీధర్, కొమెరెల్లి పవన్‌కుమార్, డాక్టర్ మామిడి రాజేష్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్ దంపతులు, ఆలయ సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌శర్మ, తిరుపతి, రమేష్, మామిడివాడ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరికి జైలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: పికప్ వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన వాహన డ్రైవర్ ఆలకుంట రాజు, యాజమాని ఆలకుంట శేఖర్‌లను కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 15 రోజుల పాటు జైలు శిక్ష విధించారని ఏఎస్‌ఐ కిషన్‌రావు బుధవారం తెలిపారు. ఈ నెల 26న స్టేషన్ హౌజ్ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలోని కానిస్టేబుళ్ల సతీష్, మహేందర్, శ్రీకాంత్‌లు అక్కపల్లి గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో వీరు ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేశామని చెప్పారు. విచారణ జరిపి గతంలోనూ ఇద్దరిపై కేసులు ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో సిరిసిల్ల కోర్టులో హాజరు పర్చామని పేర్కొన్నారు. న్యాయమూర్తి ఆలకుంట రాజు, ఆలకుంట శేఖర్‌లకు 15 రోజుల జైలు విధించారని ఏఎస్‌ఐ కిషన్‌రావు వివరించారు.

ఇంటర్ బీసీ విద్యార్థుల ఫీజు ప్రభుత్వం భరించాలి

గణేశ్‌నగర్, మార్చి27: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ చదివే బీసీ విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం నిర్ణయించి రీయింబర్స్ రూపంలో విద్యార్థులకు అందజేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసు పెద్ది శ్రీధర్ రాజు ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో బీసీ విద్యార్థులందరికీ పూర్తి ఫీజులు అందజేస్తామని ప్రకటించిందన్నారు.

అదృశ్యమైన విద్యార్థి మృతి

● 27రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు



అభిలాష్(ఫైల్)

తిమ్మాపూర్, మార్చి27: స్థానికంగా ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి ఈ నెల 1న కళాశాల నుంచి బయటకు వెళ్లి 27రోజుల తరువాత ఓ వ్యవసాయ బావిలో అతని మృతదేశం లభ్యమైంది. మృతుని కుటుంబ సభ్యులు, సీఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం, దామరకుంట గ్రామానికి చెందిన ఎనగంటి శ్రీనివాస్ రజిత దంపతులకు ఇద్దరు కుమా రులు. పెద్ద కుమారుడు ఎనగంటి అభిలాష్ (26) కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఉండి డిప్లొమా చదువుతున్నాడు. మార్చి ఒకటో తేదీన కళాశాల నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి అభిలాష్ తిరిగి కళాశాలకు చేరుకోలేదు. ఈ విషయం అతని తండ్రికి కళాశాల వార్డెన్ సమాచారం అందించారు. దీంతో తల్లిదండ్రులు స్థానికంగా ఎల్ఎండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఓ వివాహితను కాపాడే ప్రయత్నంలో విద్యార్థి మృతదేహం గుర్తింపు

అలుగునూర్‌కి చెందిన ఓ వివాహిత ఇంట్లో వేధిస్తున్నారని తాను బావిలో పడి చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు 100నెంబరుకు సమాచారం అందించారు. ఎల్ఎండీ పోలీసుల సహకారంతో తిమ్మాపూర్ స్టేజీకి సమీపంలో వ్యవసాయ బావుల వద్ద వివాహిత కోసం వెతికారు. ఆ సమయంలో ఓ వ్యవసాయ బావిలో విద్యార్థి అభిలాష్ మృతదేహంను గుర్తించారు. సంఘటన స్థలానికి తిమ్మాపూర్ సిఐ కర్రె స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి అభిలాష్ మృతదేహంగా నిర్ధారించారు. అతని తండ్రికి సమాచారం అందించి పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని అభిలాష్ తండ్రి శ్రీనివాస్‌కు అప్పగించారు. తన కుమారుడి మృతి అనుమానాస్పదంగా ఉందని అభిలాష్ తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో వైపు మహిళను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న హరీష్‌రావు

● ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పంటలు ఎండిపోకుండా చర్యలు చేపడుతుంటే రైతులు ఆందోళన చెందేలా మాజీ మంత్రి హరీష్‌రావు వాస్తవాలను వక్రీకరిస్తూ మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం ఎమ్మెల్సీ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రబీ పంటల సాగు నీటి సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం విస్మయం కలిగిస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రబీ పంటకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించకుండా ఎస్సారెస్పీలో ఉన్న నీటిని తరలించడంతో సాగు నీటి సమస్య తలెత్తిందిన్నారు. 2023 సంవత్సరం జనవరితో పోల్చితే 2024 జనవరిలో 10 నుంచి 20 మిలియన్ల విద్యుత్ అధికంగా వినియోగం పెరిగిందనే విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు తెలుసుకుని విద్యుత్‌పై మాట్లాడాలని హితవు పలికారు. గత ప్రభుత్వం దీర్ఘకాలిక రుణాల అప్పులపై వడ్డీ రాయితీ పూర్తిగా ఎత్తి వేసిందని, పంటల బీమా పథకానికి నిధులు చెల్లించలేక పథకాన్నే ఎత్తివేశారని ఎద్దేవా చేశారు. 10 సంవత్సరాల కాలంలో ఎప్పుడైనా పంట నష్టపరిహారం చెల్లించారా అని హరీష్‌రావును ప్రశ్నించారు. పంట రుణాలకు సంబంధించి రైతులపై ఎటువంటి చర్యలు చేపట్టవద్దని, ప్రభుత్వమే రుణాలు చెల్లించేలా బాధ్యత వహించేలా బ్యాంకర్లతో పాటు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు సాగుతుందన్నారు. అకాల వర్షాలు, ప్రకృతి వైపరిత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుని పంట ఎంత నష్టపోతే అంత పరిహారం ఇస్తామని ఈ విషయంలో సీఎం ఇదివరకే జిల్లా కలెక్టర్లుకు ఆదేశాలు ఇచ్చారని అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గోవర్ధన్‌కు చక్కెర ఫ్యాక్టరీ ఎప్పుడు ప్రారంభించారో, ఎవరి హయాంలో మూత పడిందో, దీనిని ఎవరు కొనుగోలు చేశారో అనే విషయాలు తెలువకుండా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. జగిత్యాల ప్రాంతానికి కవిత ఎంపీగా ఉన్న సమయంలోనే చక్కెర ఫ్యాక్టరీ పూర్తవగా మూతపడిన విషయం రైతులకు తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని మెనిఫెస్టోలో పెట్టామన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చేలా పునఃప్రారంభించే చర్యలో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసిందని వివరించారు. చక్కెర ఫ్యాకరీని పుఃనప్రారంభం చేయించే బాధ్యత నాదేనని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, క్లబ్ కార్యదర్శి పుప్పాల అశోక్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, నాయకులు గుంటి జగదీశ్వర్, గాజుల రాజేందర్, చాంద్ పాషా, శంకర్, అంజయ్య, మహేష్, మహిపాల్, వసంత్ రావు, రజనీకాంత్, విజయ్, మీర్‌ఖాజీం అలీ తదితరులు ఉన్నారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.1.11కోట్లు



కొండగట్టులో హుండీ లెక్కిస్తున్న భక్తులు

మల్యాల, మార్చి 27: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కింపు చేపట్టారు. 48 రోజులకు ఈ హుండీల ద్వారా రూ.1,11,07,329 నగదు దేవస్థానానికి సమకూరింది. ఈ లెక్కింపులో నగదుతో పాటు 74 గ్రాముల మిశ్రమ బంగారం, 5.500కిలోల మిశ్రమ వెండి, 40 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ దేవాదాయ శాఖ డీసీ జి సంజీవరెడ్డి పరిశీలకులుగా పాల్గొనగా ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఆలయ సిబ్బంది, ఏఎస్సైలు చిలుక శ్రీనివాస్, రమణారెడ్డి తదితరులు ఈ లెక్కింపులో ఉన్నారు.

ఎస్‌యూలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్



ఎస్‌యూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

గణేశ్‌నగర్, మార్చి27: శాతవాహన విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు అపూర్వ స్పందన వచ్చినట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్, శాతవాహన విశ్వవిద్యాలయం డాక్టర్ మనోహర్ తెలియజేశారు. ఆక్సిస్ బ్యాంక్, యాక్సెంచర్, పతంజలి సంస్థలు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాయని తెలిపారు. దీనికి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో యాక్సిస్ బ్యాంక్‌కు పదిమంది, యాక్సెంచర్‌కు ఆరుగురు, పతంజలిలో 13మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొత్తం 31 మంది ఎంపికయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్, శాతవాహన విశ్వవిద్యాలయం డాక్టర్ ఈ మనోహర్ తెలియజేశారు.

1300 కేజీల పేలుడు పదార్థాల పట్టివేత

● ఇద్దరి అరెస్టు, వాహనం సీజ్



పేలుడు పదార్థాలను చూపిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, మార్చి 27: జిల్లాలో పేలుడు పదార్థాలను అక్రమ రవాణా చేస్తే ఊరుకోమని, అలాంటి వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ హెచ్చరించారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మరిపెడ మండలం వీరారం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా జగిత్యాల జిల్లా నుంచి మరిపెడకు వస్తున్న ఓ బోలెరో ట్రాలీ వాహనం పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారని, దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ వాహనంను తనిఖీ చేశారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట చెందిన కస్తూరి కుమార్, కస్తూరి సారయ్య, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం దంటకుంట తండాకు చెందిన దరావత్ కిశోర్ కలిసి బోలెరో ట్రాలీలో 50 ఎలక్ట్రానిక్ డిటోనేటర్స్, 32 బాక్సులలో జిలెటిన్‌జిక్స్ పవర్ మొత్తం 6400, 20 బాక్సుల్లో జిలెటిన్ స్టిక్స్ పవర్ బూస్టర్‌లు 180, మొత్తం పేలుడు పదార్థాలు 1300 కేజీలను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దాడులు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకుని రవాణాకు ఉపయోగించిన ట్రాలీ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కస్తూరి కుమార్ తండ్రి సారయ్య పేరుమీద వెంకటరమణ ఎంటర్‌ప్రైజెస్ తెలంగాణ జగిత్యాల జిల్లా వెలగటూరు మండలం జగదేవ్‌పేట పేరుపై లైసెన్స్ తీసుకుని లైసెన్స్ ప్రకారం కేవలం నిర్ణీత పరిధిలో మాత్రమే పేలుడు పదార్థాలను అమ్ముకోవాల్సి ఉందన్నారు. కానీ, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతోనే అక్రమంగా పేలుడు పదార్థాలను అనుమతి లేనివారికి విక్రయిస్తూ పట్టుబడ్డారని, ఈ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ప్రస్తుతం కస్తూరి సారయ్య పరారీలో ఉన్నట్లు చెప్పారు. త్వరలోనే అతడిని అరెస్టు చేస్తామని తెలిపారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య నేతృత్వంలో ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన మరిపెడ సీఐ హత్తిరాం, ఎస్సై తహేర్‌బాబా, సిబ్బంది ఉన్నారు.

పొలాసలో వ్యవసాయ పరిశోధనలపై సమావేశాలు



హాజరైన అధికారులు, రైతులు

జగిత్యాలరూరల్, మార్చి 27: ఉత్తర తెలంగాణ మండల వ్యవ సాయ పరిశోధన విస్తరణ సలహా సంఘ వానాకాలం- యాసంగి పంటలకు సంబంధించిన సమావేశాలు జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం ప్రారంభం అయ్యాయి. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకులు సుధారాణి, జ్యోతి ప్రజ్వలనచేసి సమా వేశాన్ని ప్రారం భించారు. పొలాస పరిశోధన కేంద్రంలో గత సంవత్సరంలో జరిగిన పరిశోధన ఫలితాలను డాక్టర్ శ్రీనివాస్ రైతులకు వివరించారు. అనంతరం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మంజులత గత సంవత్సరంలో సలహా సంఘంలోని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తర తెలంగాణ జిల్లాల వ్యవ సాయ అధికారులు వారి జిల్లాలో ఉన్న పంటలు, ఆ పంటలలోని సమస్యలను, ఇబ్బందులను, ఫలితాలను ప్రజెంటేషన్ రూపంలో తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

తంగళ్లపల్లి, మార్చి 27: తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి, డీపీవో వీర బుచ్చయ్య ఆదేశించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్‌లో పర్యటించారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తితే ప్రైవెట్ బోరును అద్దెకు తీసుకొని నీటి సరఫరా చేస్తుండగా బోరును పరిశీలించారు. గ్రామ పంచాయతీలోని ఏడు రకాల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జోగం రాజు, కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కక్కుర్తితో ప్రమాదంలో ప్రాజెక్టులు

ఇల్లంతకుంట, మార్చి 27: కమీషన్లకు కక్కుర్తి పడడంతోనే ప్రాజెక్టులు ప్రమాదంలో పడ్డాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే కరువు వచ్చిందని బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గతేడాది సరైన వర్షాలు లేవనే విషయం బీఆర్‌ఎస్ నాయకులకు తెలియదా? అని ప్రశ్నించారు. మండలంలోని అన్నపూర్ణ ప్రాజెక్టు ద్వారా 25వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పి అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని ఎకరాలకు సాగు నీరు అందించారో స్పష్టం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు వచ్చే సరికి రైతులు గుర్తుకొస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అవాస్తవాలు చెప్పడం మానుకోవాలని, వాస్తవ పరిస్థితులను రైతులకు వివరించాలని అన్నారు. సమావేశంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీటీసీ యాస తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

గాలిపెల్లి పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ

ఇల్లంతకుంట, మార్చి 27: మండలంలోని గాలిపెల్లి పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ జరిగింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి ఆలయంలో చోరి జరిగిందని గుర్తించారు. పెద్దమ్మతల్లి విగ్రహానికి ఉన్న పుస్తెమట్టెలు, ముక్కు పుడక, బొట్టుబిల్లు, కళ్లను ఎత్తుకెళ్లారు. దాదాపు రూ లక్ష విలువైన ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న సీసీ కెమరాలలో దొంగతనం రికార్డు కాలేదు. దీంతో వాటిని పనిచేయకుండా చేసి ఉంటారని భావిస్తున్నారు. మూడు నెలల క్రితం ఇదే ఆలయంలోని గంటను దొంగలు ఎత్తుకెళారు. ఎస్సై రాజుగౌడ్‌తోపాటు క్లూస్‌టీం సిబ్బంది వచ్చి పరిశీలించారు. కేసున దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ పురస్కార గ్రహీతకు సన్మానం

ఎల్లారెడ్డిపేట ,మార్చి 26: ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ జాతీయ పురస్కార గ్రహీత, సిద్దిపేట జిల్లాకు చెందిన అందె భాస్కర్ - జమున దంపతులను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం కళాకారులు ఘనంగా సన్మానించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన అందే భాస్కర్ డప్పుపై గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఢిల్లీలో ప్రదర్శించిన ప్రతిభకు పురస్కారం అందుకున్నారు. కిషోర్ కుమార్, ముత్తయ్య ప్రమోద్, అనిల్, మధు, బంటి, ఆశీర్వాదం, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి సంతాపం

ఇల్లంతకుంట, మార్చి 27: మండలంలోని కందికట్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎల్లంకి సాయితేజ అనే విద్యార్థి మృతికి బుధవారం సంతాపం ప్రకటించారు. సాయితేజ గుండెపోటుతో మంగళవారం పాఠశాల ఆవరణలో మృతిచెందాడు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని విమర్శించే స్థాయి ఉమేష్‌రావుకు లేదు

సిరిసిల్ల రూరల్, మార్చి 27 : కరీంనగర్ ఎంపీ బండిసంజయ్‌కుమార్‌ను విమర్శించే స్థాయి చీటి ఉమేష్‌రావుకు లేదని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గంతో పాటు కాంగ్రెస్‌లో గుర్తింపు లేని వ్యక్తి ఎంపీ బండి సంజయ్‌పై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇటీవల ఎంపీ చేపట్టిన ప్రజాహిత యాత్రలో ఎంపీగా చేసిన అభివృద్ధిని వివరించారన్నారు. వార్డు మెంబర్‌గా గెలువలేని ఉమేష్‌రావు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎంపీగా మీ మామ కేసీఆర్ పని చేసిన సమయంలో ఏం అభివృద్ధి చేశాడో గుర్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి నరేష్, జిల్లా కార్యదర్శి ముద్దాల బుగ్గారెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు చొప్పదండి అంజన్న, ఉరగొండ రాజు, గాజుల సదానందం, చొప్పదండి శ్రీనివాస్, రచ్చ రాహుల్, సిరిమల్ల మల్లేశం, పండుగ మాధవి, కోడం శ్రీనివాస్, భారత్ మహేష్, పోశెట్టి, సత్యం పాల్గొన్నారు.

భూములను తిరిగి ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 27 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా లాక్కున్న భూములను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దళిత వర్గాలకు తిరిగి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రావణపెల్లి మల్లేశం కోరారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐటీయూసీ)జిల్లా ముఖ్యనాయకుల సమావేశంలో సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రావణపెల్లి మల్లేశం, ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళిత వర్గాలు కొన్నేళ్లుగా జిల్లా వ్యాప్తంగా సాగు చేసుకున్న దాదాపు ఐదు వేల ఎకరాల భూములను లాక్కుని వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారన్నారు. ఉపాధి హామి పథకం బకాయిలను ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని ఉపాధి హామీ కార్మికులకు సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం సభ్యులు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు

తంగళ్లపల్లి, మార్చి 27: అనుమతి లేకుండా నిర్మిస్తున్న రేకుల షెడ్డు పనులను బుధవారం పంచాయతీ కార్యదర్శి శ్రీదర్‌రెడ్డి ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. సిరిసిల్ల- సిద్దిపేట ప్రధాన రహదారి పక్కన పండ్ల వ్యాపారి ఫుట్‌పాత్ పగల గొట్టి అనుమతి లేకుండా రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టాడు. ఈ విషయమై గ్రామ పంచాయతీకి ఫిర్యాదు అందడంతో రేకుల షెడ్డు నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శి శ్రీదర్‌రెడ్డి ప్రశ్నించారు. దీంతో షెడ్డు యజమాని కార్యదర్శిపై దురుసుగా ప్రవర్తించాడు. గతంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డు పక్కన పండ్ల దుకాణం ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రస్తుతం అక్కడ బిల్డింగ్ మరమ్మతు జరుగుతుం డడంతో పండ్ల దుకాణం ఏర్పాటు కోసం ఫుట్‌పాత్‌ను పగల గొట్టి అనుమతి లేకుండా రేకుల షెడ్డును ఏర్పాటు చేస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పొలంబాట పేరిట బీఆర్‌ఎస్ నేతల మొసలి కన్నీరు

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు అన్నదాతలను పట్టించుకోలేని బీఆర్‌ఎస్ నేతలు ప్రస్తుతం పొలంబాట పేరిట పంట పొలాలను సందర్శిస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని అన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, రాంరెడ్డి, ఇమాం, గణపతి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలోని పాల ఉత్పత్తిదారుల సంఘం సభ్యుడు మారోజు శ్రీనివాస్- సుజాత దంపతుల కూతురు శిరీష వివాహానికి బుధవారం కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సమకూర్చిన పుస్తెమట్టెలను సభ్యులు అందజేశారు. సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న విద్యార్థి కోనేటి అద్విత్‌కు గాయమవడంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశామని పోలీసులు బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని కోనేటి రమేశ్ కొడుకు అద్విత్ స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడని, ఈఏడాది జనవరి 9న అద్విత్‌ను పాఠశాలకు పంపించారని పేర్కొన్నారు. కంటి వద్ద గాయమైనా పాఠశాల యాజమాన్యం సమాచారం ఇవ్వకపోవడంతో విద్యార్థి పరిస్థితి విషమంగా మారిందని పేర్కొన్నారు. అదే రోజు విద్యార్థి తండ్రి రమేశ్ స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారని, మెరుగైన వైద్యం కోసం సిరిసిల్ల, సిద్ధిపేట, హైదరాబాద్‌కు తరలించారని తెలిపారు. బడిలో తమ కొడుకు అద్విత్ కంటికి గాయమైన తమకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాలపై చర్యలు తీసుకోవాలని రమేశ్ ఫిర్యాదు చేశారని చెప్పారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ముందుకుసాగని హైలెవల్ బ్రిడ్జి పనులు


హైలెవల్ బ్రిడ్జి నిర్మించాల్సిన లింగన్నపేట వాగు

- నిలిచిన లింగన్నపేట హైలెవల్ వంతెన పనులు
- పిల్లర్ల గుంతలకే పరిమితం
- నెలలు దాటినా చలనం లేని వైనం

గంభీరావుపేట, మార్చి 27: గంభీరావుపేట- లింగన్నపేట మానేరు వాగుపై నిర్మించ తలపెట్టిన హైలెవల్ బ్రిడ్జి పనులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. నిర్మాణ పనులు పిల్లర్ల గంతలకే పరిమితమయ్యాయి. నెలలు గడుస్తున్నా పనుల్లో చలనం లేకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది. గంభీరావుపేట- లింగన్నపేట మానేరు వాగుపై లోవెల్ వంతెన ఉండేది. వర్షాకాలంలో ఎగువ మానేరు పొంగిన ప్రతీసారి ఈ వంతెన మునిగి పోవడంతో సిద్దిపేట, కామారెడ్డి మధ్య రాకపోకలు నిలిచిపోయేవి. రాకపోకల పునరుద్ధరణకు 15 రోజుల సమయం పట్టేది. దీంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతూ ఇతర మార్గాల ద్వారా గమ్యం చేరేవారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, నాయకులు గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్‌కు వాగుపై వంతెన నిర్మించాలని విన్నవించారు. దీంతో స్పందించిన కేటీఆర్ హైలెవల్ బ్రిడ్జి కోసం రూ.17 కోట్లు మంజూరు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ హైలెవల్ బ్రిడ్జి పనుల టెండర్ దక్కించుకున్నాడు. మూడు నెలల కిందట పనులు ప్రారంభించాడు. పనుల్లో భాగంగా లోవెల్ బ్రిడ్జిని తొలగించి, అదే స్థలంలో పిల్లర్ల కోసం గుంతలు తవ్వారు. వాహనాల రాకపోకల కోసం పక్కనే తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. ఇదంతా బాగానే ఉన్నా పనులు మొదలై నెలలు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. వర్షాకాలంలోపు బ్రిడ్జి పనులు పూర్తవుతాయని భావించినా పరిస్థితులు చూస్తుంటే ఆ లోపు పనులు పూర్తయ్యే అవకాశాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. వర్షాకాలంలోపు పనులు పూర్తి కాకుంటే లోలెవల్ వంతెన లేకపోవడం ఒక సమస్య అయితే మరో వైపు వేసిన మట్టి రోడ్డు వర్షాలకు కొట్టుకు పోయే ప్రమాదం లేకపోలేదు. దీంతో వర్షాకాలం గడిచి పోయాక కూడా రోడ్డు లేక ఈ మార్గం గుండా వాహనాలు నడవని పరిస్థితి నెలకొంటుంది. బ్రిడ్జి పనులను వర్షాకాలంలోపు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు మొదలు పెట్టకుంటే ఆందోళన చేస్తాం



- దోసల చంద్రం, ప్రజా బంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు

లింగన్నపేట బ్రిడ్జి పనులను మొదలు పెట్టకుంటే ఆందోళన చేస్తాం. టెండర్లు పూర్తయి నెలలు గడుస్తున్నా పనులపై ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు. వర్షాకాలంలోపు పనులు పూర్తి చేయని పక్షంలో ఈ ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులు పడే అవకాశం ఉంది. బ్రిడ్జి పనులపై నిర్లక్ష్యం చేస్తే ప్రజల మద్దతుతో ఆందోళన చేపడతాం.

అధికారులు పట్టించుకోవాలి



- లక్కం బాబు, మాల మహానాడు మండల అధ్యక్షుడు

లింగన్నపేట బ్రిడ్జి నిర్మాణ పనుల జాప్యంపై సంబంధిత అధికారులు పట్టించుకోవాలి. లో లెవల్ వంతెన ఉండగానే హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాల్సి ఉండగా. ఉన్న లోలెవల్ వంతెనను కూల్చేశారు. ఇప్పుడు కొత్త బ్రిడ్జిని తొందరగా నిర్మించకుంటే పరిస్థితి ఏమిటి? అధికారులు పట్టించుకోవాలి. కాంట్రాక్టర్ తొందరగా బ్రిడ్జి నిర్మించే విధంగా చూడాలి.

గెలుపుపై కలలు కంటున్న సీఎం


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే వంద రోజుల పాలనకు రెఫరెండమని సీఎం రేవంత్‌రెడ్డి కలలు కంటున్నారని, గ్రామాల్లో ప్రజలు తేల్చనున్నారని కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మంచి చేస్తారని మార్పు కోరుకుంటే ముంచుతున్నారన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. గ్రామాల్లో పర్యటిస్తుంటే అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌పై వ్యతిరేకత చూపుతున్నారన్నారు. సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిన ప్రాంతంలో కాపర్ డ్యాం నిర్మాణం చేపడితే సాగు నీరు అందేదన్నారు. రూ.2 లక్షల రుణ మాఫీ, మహిళలకు రూ.2500, ఉచిత సిలిండర్, ఆసరా పింఛన్లు, రైతు భరోసా, రైతు బంధు, పంట బోనస్ అందించకుండా మోసగిస్తోందన్నారు. ఎండిన పంటలకు ఎకరానికి రూ25 వేల పరిహారం చెల్లించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో బీఆర్‌ఎస్ నేత దరువు ఎల్లన్న మేనకోడలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ పార్లమెంటు ఎన్నికల సిరిసిల్ల నియోజక వర్గ పరిశీలకురాలు తుల ఉమ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, టెక్స్‌టైల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రవీణ్, ఎంపీటీసీ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ల ఎన్నికలు

సిరిసిల్ల క్రైం, మార్చి 27: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్‌ల ఎన్నికను గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్‌మెంట్ కాబడి ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ ఎగ్జామ్(ఏఐబిఇ) ఉత్తీర్ణులై సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీఓపి) కలిగి ఉన్నవారికి మాత్రమే ఓటు హాక్కు ఉంటుంది. దీంతో ఈ ఎన్నికల్లో సిరిసిల్ల జిల్లా కోర్టులో 172మంది, వేములవాడకోర్టులో 103మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో 25మంది మహిళా న్యాయవాదులు ఉన్నారు. పోలింగ్ అనంతరం ఓట్లు లెక్కించి ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల అధికారులు సురభి సత్యనారాయణరావు, విద్యాసాగర్‌రావు తెలిపారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి డి.సంజీవరెడ్డి, జె.శ్రీనివాసరావు, ఎస్. వసంతం పోటీ పడుతున్నారు. ప్రధాన కార్యదర్శి స్థానానికి టి.వెంకటి, వి. గోవర్ధన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి స్థానానికి బి.నాగరాజు గౌడ్, పసునూరి మధు, కోశాధికారి స్థానానికి బిట్ల విష్ణు, చీకట్ల వెంకటయ్య, సాంస్కృతిక, క్రీడల కార్యదర్శికి గుడ్ల కిషన్, మొగిలి రాజు, గ్రంథాలయ కార్యదర్శి స్థానానికి ఎ.సురేశ్ ప్రసాద్, జి.శశాంకం పోటీపడుతున్నారు. వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి గుడిసె సదానందం, పిట్టల మనోహర్, ప్రధాన కార్యదర్శికి అవదూత రజనీకాంత్, పుప్పాల భానుకృష్ణ, జాయింట్ సెక్రెటరీకి గొంటి శంకర్, రాజూరి రమేశ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్‌కార్యదర్శికి నాగుల సంపత్‌గౌడ్, నరాల శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శికి గుజ్జె మనోహర్, రేగుల రాజ్‌కుమార్, బొజ్జ మహేందర్, కోశాధికారికి బొడ్డు ప్రశాంత్, కటుకం జనార్దన్, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా గంప మహేశ్, మొగిలి సుజాత, పంపరి శంకరయ్య, జెట్టి శేఖర్, కనికరపు శ్రీనివాస్ పోటీపడుతున్నారు.

సుద్దాలలో పెద్దమ్మ బోనాలు

కోనరావుపేట, మార్చి 27 : ముదిరాజ్‌ల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి బోనాలను కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మల్లేశం, బాలమల్లు ఏర్పాట్లు చేశారు.

కుక్కలదాడిలో దూడలు మృతి

ముస్తాబాద్, మార్చి 27: ముస్తాబాద్ మండల కేంద్రంలో బుధవారం కుక్కల దాడిలో మూడు దూడలు మృతి చెందినట్లు పాడిరైతులు కొణతాల దేవిరెడ్డి, జాల భిక్షపతి తెలి పారు. ఊర కుక్కల దాడిలో కొణతాల దేవిరెడ్డికి చెందిన రెం డు దూడలు, జాల భిక్షపతికి చెందిన ఒక దూడ మృతిచెం దాయి. కుక్కలను కట్టడి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతీ రైతును ఆదుకుంటాం

ముస్తాబాద్, మార్చి 27:వడగండ్లవానతో పంటనష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామని కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ బూటకపు మాటలు, బీజేపీ మతం చిచ్చు మాటలు నమ్మవద్దన్నారు. పనిగట్టుకొని కాంగ్రెస్ ప్రభ్యుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో పంటనష్టపోయిన రైతులను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నష్టపోయిన ప్రతీ రైతుకు రూ.10వేలు అందిస్తామన్నారు. మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తామన్నారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టన అధ్యక్షుడు గజ్జెల రాజు, జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, బీసీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు శీల ప్రశాంత్, తలారి నర్సింలు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రంజాని నరేశ్, తాళ్ల విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎండిన వరి పరిశీలన

తంగళ్లపల్లి, మార్చి 27: తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో ఎండిన వరిపంటను బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం పరిశీలించారు. భూగర్భ జలాలు అడుగంటి పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ఎండల్లో సైతం చెరువులు నీటితో కళకళలాడాయన్నారు. ఎంపీపీ పడిగెల మానస రాజు, నాయకులు గజభీంకర్ రాజన్న, మాట్ల మధు, కొయ్యడ రమేశ్, చిలివేరి చిరంజీవి, అమర్‌రావు, సిరిసిల్ల పర్శరాములు, సధాకర్ పాల్గొన్నారు.

పుట్టగొడుగులపై అవగాహన

చందుర్తి, మార్చి 27: చందుర్తి మండలం కట్టలింగంపేటలో ఓ ఇంటి వద్ద మొలిచిన పుట్టగొడుగును తెలంగాణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తీసివేసి అవగాహన కల్పించారు. అరుదైన జాతి పుట్టగొడుగుపై అపోహలు నమ్మవద్దని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతి రమేష్ అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను విచారించాలి

సారంగాపూర్, మార్చి 27: ఫోన్ ట్యాపింగ్ విషయంలో అధికారులనే కాకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విచారించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం సారంగాపూర్, సోతారంలో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పూజలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గాలి వీస్తుందన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా తనకు పార్టీ అవకాశం ఇచ్చిందని కార్యకర్తలు, నాయకులు గెలిపించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చందుర్తి, మార్చి 27: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. చందుర్తి మండలం బండపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, అంగన్‌వాడీ టీచర్లు న్యాత పద్మ, బుర్ర రేణుక, గసికంటి రేణుక పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

చందుర్తి, మార్చి 27: చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని భక్తాంజనేయస్వామి, శివ పంచమదన, ధ్వజస్తంభం, నవగ్రహ నూతన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జ్వాలాతోరణం, అగ్నిప్రతిష్ట, మూలమూర్తుల హోమం, నిత్య పూర్ణాహుతి, మధ్యాహ్నం వాస్తు ఆరాధన, వాస్తు హోమం, పర్వ అగ్ని కరణం, సాయంత్రం నిత్యహోమం, స్నాపణం వంటి కార్యక్రమాలు చేపట్టారు.

వరి తెగుళ్లను పరిశీలించిన ఏవో

కోనరావుపేట, మార్చి 27 : కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో వరికి సోకిన తెగుళ్లను వ్యవసాయ అధికారి వెంకట్రామవ్వ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలతో ఆకునల్లి కంకి నల్లి వరికి సోకుతుందని అన్నారు. దీనికి నివారణకు ఐదు మిల్లీమీటర్ల డైకోల్‌ను నీటిలో కలిపి పిచికారి చేయాలని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా నాగరాజు

రుద్రంగి, మార్చి 27 రుద్రంగి మండల పంచాయతీ కార్యదర్శ మండల అధ్యక్షుడిగా తేలు నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల పరిషత్‌లో ఎంపీవో సుధాకర్ ఆధ్వర్యంలో రుద్రంగి మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తేలు నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ముదాం సతీష్, ప్రధాన కార్యదర్శిగా గంగుల ప్రశాంత్, కోశాధికారిగా మారుపాక సురేష్ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు

చందుర్తి, మార్చి 27: ఉద్యోగి చేసిన సేవలు గుర్తింపుని స్తాయని ప్రధానోపాధ్యాయులు రేగొండ సత్యనారాయణ అన్నారు. చందుర్తి మండలం సనుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ మారం హన్మాండ్లు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు

సిరిసిల్ల క్రైం, మార్చి 27: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో విధుల నిర్వహణపై కేంద్రసాయుధ పోలీసు బలగాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన అన్ని విధుల్లో కేంద్ర బలగాలు జిల్లా పోలీసులతో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తర్వాత అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నియంత్రించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కేంద్ర సాయుధ బలగాలను క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లు, రూట్ బందోబస్తు, కీలకమైన పాయింట్‌ల వద్ద సెంట్రల్ ఫోర్స్ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలకు భద్రత భావాన్ని కలిగించాలన్నారు. సమావేశంలో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ సీఐ సదన్‌కుమార్, స్పెషల్ బ్రాంచి సీఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి


మాట్లాడుతున్న కొండూరు రవీందర్‌రావు

సిరిసిల్ల రూరల్ మార్చి 27: సింగిల్ విండో పరిధిలో రైతులకు ఇచ్చిన రుణాలను సకాలంలో చెల్లించాలని, సింగిల్ విండో అభివృద్ధికి రైతులు సహకరించాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూరు సింగిల్ విండో సర్వసభ్య సమావేశం బుధవారం చైర్మన్ జీల కిషన్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రస్తుతం సింగిల్ విండో ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలో ఉండగా దానిని కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోకి మార్చేందుకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ బెజ్జారం నారాయణ గౌడ్, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట, మార్చి 27 : పార్లమెంట్ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించడానికి ప్రజాప్రతినిధులు సహకరించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఆయా పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓటర్లకు మద్యం, చీరలు, డబ్బులు పంచితే చట్టరీత్యా నేరం అవుతుందన్నారు. ఒకసారి కేసు ఐతే ఇబ్బందులు ఉంటాయని సూచించారు. ఆయా పార్టీల నాయకులు ఎన్నికలు శాంతియుతంగా జరగడానికి కృషి చేయాలని అన్నారు. సమావేశంలో కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు, ఏఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే వస్త్ర పరిశ్రమలో సంక్షోభం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 27 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభలోకి నెట్టింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ పవర్ లూం టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఖండిస్తున్నామన్నారు. సిరి సిల్లలో కొందరి స్వలాభం కోసం బతుకమ్మ చీరలను తీసుకొచ్చి కార్మి కులను, ఆసాములను నష్ట పోయేలా చేసింది గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. ఎన్నికల ముందు కాంట్రాక్టు కమీషన్ల కోసం లక్షల కోట్లు బిల్లుల ను మంజూరు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే బతుకమ్మ చీరల బకాయిలు, కార్మికుల యారన్ సబ్సిడీ ఎందుకు మంజూరు చేయ లేదని ప్రశ్నించారు. అప్పుడు రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి అప్పులోకి నెట్టి ఇప్పుడు మళ్లీ బతుకమ్మ బకా యిలు, యారన్ సబ్సిడీ ఇవ్వడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు 110 రోజుల మాత్రమే అయ్యిందని ఇప్పటికే ఆరు గ్యారెంటీలను, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేసిందని అన్నారు. వస్త్రవ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలపై లేనిపోని అబండాలు వేయడం సరికాదన్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలను తీసుకెళ్లామన్నారు. బతుకమ్మ చీరల బకాయిలను త్వరలోనే ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప మాట్లాడుతూ సిరిసిల్ల ఆసాములు, కార్మికులు రోడ్ల మీదికి రావడం బీఆర్‌ఎస్ ప్రభుత్వం వల్లేనని ఆరోపించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. పద్మశాలీలు, నేత కార్మికులపై ప్రేమ ఉన్నట్లు నటిస్తూ ఓటు బ్యాంక్ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వ్యాన ప్రసాద్, ఉపాధక్షుడు బొప్ప దేవయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, కౌన్సిలర్లు కుడికాల రవికుమార్, వేముల రవి, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కామినేని రవీందర్, మాజీ కౌన్సిలర్ వెంగళ నర్సయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.